RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 197 | ఆగస్టు 17 సోమవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 197 | August 17 Monday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


చరిత్ర తెలుసుకుంటేనే ...భవిష్యత్ నిర్మాణం

2

## చికెన్ ధరలు తగ్గుముఖం



**హైదరాబాద్ / విజయవాడ జనసంఘర్షణ**

తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో కోడి మాంసం ధరలు ఒక్కసారిగా భారీగా తగ్గుముఖం పట్టాయి. పవిత్ర శ్రావణమాసం ప్రారంభం కావడంతో మార్కెట్‌లో చికెన్‌కు డిమాండ్ భారీగా పడిపోయింది. దీంతో పౌల్ట్రీ వ్యాపారులు ధరలను గణనీయంగా తగ్గించి విక్రయిస్తున్నారు.

పది రోజుల్లోనే భారీ తగ్గుదల గత పది రోజుల క్రితం వరకు మార్కెట్‌లో స్కిన్‌లెస్ చికెన్ ధర కిలో రూ. 280 నుండి రూ. 300 వరకు పలికింది. అయితే శ్రావణమాస పూజలు, వ్రతాల కారణంగా ప్రస్తుతం ఆ ధరలు ఒక్కసారిగా రూ. 220 నుండి రూ. 240 వరకు పడిపోయాయి. అంటే ప్రాంతాన్ని బట్టి కిలోపై ఏకంగా రూ. 40 నుంచి రూ. 60 వరకు ధర తగ్గింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు, అనకాపల్లి, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ. 220 నుండి రూ. 240 మధ్య విక్రయిస్తున్నారు. అటు తెలంగాణలోని హైదరాబాద్, వరంగల్,

➤ మిగతా 2వ పేజిలో..

## అక్టోబర్‌లో పీఎం కిసాన్



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**


పీఎం కిసాన్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అర్హులైన రైతులకు ప్రతి ఏటా ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ క్రమంలో త్వరలో విడుదల కానున్న పీఎం కిసాన్ 24వ విడత కోసం అన్నదాతలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా సంవత్సరానికి మూడు విడతలుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోంది. గత విడత నిధులు జూన్ నెలలో విడుదల కాగా, తదుపరి విడత అక్టోబర్ నెలలో ఖాతాల్లోకి వచ్చే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రెండు వేల రూపాయల చొప్పున రైతుల బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమ చేస్తోంది. ఈ ఏడాది జూన్ నెలలో ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది రైతుల ఖాతాల్లో నిధులు వేశారు. ఈ నిబంధనల ప్రకారం చూస్తే తదుపరి విడత సొమ్ము అక్టోబర్ నెలలో విడుదల కానుంది. అయితే ప్రభుత్వం ఇంకా ఎలాంటి అధికారిక తేదీని ప్రకటించలేదు. గతేడాది గణాంకాలను పరిశీలిస్తే ఈసారీ అదే సమయానికి డబ్బులు అందే ఛాన్స్ ఉంది. రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ డబ్బులు జమ కావాలంటే కొన్ని కీలక పనులు ముందుగానే పూర్తి చేయాలి. కేంద్ర ప్రభుత్వం ఈకేవైసీ ప్రక్రియను తప్పనిసరి చేసింది. ఈకేవైసీ అసంపూర్తిగా ఉంటే ఖాతాలోకి నగదు రాదు. రైతులు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి లేదా అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. అలాగే భూమి రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవడం చాలా ముఖ్యం.

భూమి రికార్డుల్లో ఎలాంటి తప్పులు ఉన్నా లేదా పేరులో తేడాలు ఉన్నా వెంటనే సరిదిద్దుకోవాలి. బ్యాంక్ అకౌంట్‌తో ఆధార్ నంబర్ కచ్చితంగా లింక్ అయి ఉండాలి. బ్యాంక్ ఖాతా యాక్టివ్‌గా ఉందో లేదో ఒకసారి తనిఖీ

➤ మిగతా 2వ పేజిలో..

### నేటి అర్ధరాత్రి నుంచి భోగాపురంలో

## విమానాల సర్వీసులు ప్రారంభం




**భోగాపురం జనసంఘర్షణ**

ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా భోగాపురంలో అట్టహాసంగా రూపుదిద్దుకున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వాణిజ్య విమాన సర్వీసులు నేడు అర్ధరాత్రి నుంచి అధికారికంగా అందుబాటులోకి రానున్నాయి. ఈ పరిణామంతో విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లోని (ఐఎన్ఎస్ డేగా) సివిల్ ఎన్‌క్లేవ్‌లో పాత వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా ముగియనున్నాయి. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ప్రకటించిన ప్రకారం, రాత్రి 12:01 గంటల నుంచి కొత్త ఎయిర్‌పోర్ట్ పూర్తిస్థాయిలో సేవలు అందించనుంది.విశాఖ నుంచి భోగాపురానికి సేవలు మారడం మరియు తొలి రోజు షెడ్యూల్ విమానయాన సంస్థలన్నీ తమ సర్వీసులను విశాఖపట్నం నుంచి భోగాపురానికి విజయవంతంగా మార్చాయి. ప్రారంభ రోజే హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, తిరుపతి వంటి ప్రధాన నగరాలకు మొత్తం 31 సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పాత విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు ఉన్న ఇంటర్నేషనల్ కోడ్‌ను కూడా భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు బదిలీ చేశారు. అయితే, జాతీయ అత్యవసర పరిస్థితులు, రక్షణ దళాలు, ప్రభుత్వ మరియు వీఐపీ విమానాల రాకపోకల కోసం మాత్రం విశాఖ ఎయిర్‌పోర్ట్‌ను యథావిధిగా వినియోగించనున్నారు. రికార్డు సమయంలో

➤ మిగతా 2వ పేజిలో..

## ప్రజల రక్షణే ప్రథమ లక్ష్యం

**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**



**తిరుపతి జనసంఘర్షణ**

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని ఎర్రవారిపాలెం మండలం మరియు దాని చుట్టుపక్కల గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తుండటం స్థానిక ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. శేషాచలం అటవీ ప్రాంతం నుండి జనావాసాల వైపు వస్తున్న ఈ

➤ మిగతా 2వ పేజిలో..

## యువత భవితకు పక్కా ప్రణాళిక

**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి**

**రూ.వందల కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం**



**ములుగు జనసంఘర్షణ**

తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గంతో పాటు ములుగు జిల్లాలో రూ. వందల కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనలో భాగంగా పరకాల నియోజకవర్గంలో పలు కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, పూర్తయిన పనుల ప్రారంభోత్సవాలు నిర్వహించడంతో పాటు ములుగు జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, అధికారులతో పాటు ప్రజాప్రతినిధులను అభినందించారు. పరకాల నియోజకవర్గం రూపురేఖలు మార్చేలా విద్యా, వైద్య, మౌలిక వసతుల రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. ఇందులో భాగంగా రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, రూ. 45.15 కోట్లతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఊజ) నిర్మాణం, రూ. 82 కోట్లతో పరకాల మున్సిపాలిటీ అభివృద్ధి పనులు, రూ. 65 కోట్లతో పరకాల నుంచి ఎర్రగట్టు గుట్ట వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు. వీటితో పాటు రూ. 32.17 కోట్ల వ్యయంతో దామెర మండలం ల్యాదేళ్లలో పరకాల ఇందిరా మహిళా డెయిరీ ప్లాంట్, రూ. 10 కోట్లతో అక్కంపేట గ్రామాభివృద్ధి, రూ. 5 కోట్లతో శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి పనులు, ఆత్మకూర్‌లో ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద టౌన్‌షిప్, రూ. 3 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్,

➤ మిగతా 2వ పేజిలో..

# చికెన్ ధరలు తగ్గుముఖం

**మొదటిపేజీ తరువాయి...** కరీంనగర్, నిజామాబాద్ నగరాల్లోనూ దాదాపు ఇదే విధమైన ధరలు కొనసాగుతున్నాయి. శ్రావణమాసంలో తెలుగు ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు, ఉపవాసాలు, వరలక్ష్మి వ్రతాలు ఆచరిస్తుంటారు. ఈ నేపథ్యంలో అత్యధిక శాతం కుటుంబాలు మాంసాహారానికి దూరంగా ఉండటంతో మార్కెట్‌లో కోడి మాంసానికి గిరాకీ గణనీయంగా తగ్గింది. సాధారణంగా వారాంతాల్లో ఉండే రద్దీ కూడా కనిపించకపోవడంతో అమ్మకాలు తగ్గి దుకాణాలు వెలవెలబోతున్నాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి .

# యువత భవితకు పక్కా ప్రణాళిక

**మొదటిపేజీ తరువాయి...** రూ. 1.10 కోట్లతో విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అదేవిధంగా పరకాలలో రూ. 35 కోట్లతో నిర్మించిన 100 పడకల ఏరియా ఆసుపత్రి, రూ. 5 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం మరియు ఆత్మకూర్‌లో రూ. 1 కోటితో ఏర్పాటు చేసిన అధునాతన స్రావీ సెంటర్‌ను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ములుగు జిల్లా సమగ్రాభివృద్ధికి అవసరమైన పూర్తి నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రసిద్ధ వేయి స్తంభాల గుడితో పోటీ పడే విధంగా వనదేవతలు సమ్మక్క - సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేశామని, మల్లూరు నరసింహ స్వామి దేవాలయానికి కూడా నిధులు కేటాయిస్తామని తెలిపారు. ఆధ్యాత్మికంతో పాటు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు జంపన్నవాగును నూటికి నూరు శాతం మోడలైజ్ చేసి అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ప్రాంతంలోని ఆదివాసీ బిడ్డలు కష్టానికి మారుపేరని, వారి కష్టాలు తీరాలంటే సాగునీరు అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఈ క్రమంలో సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారితో కలిసి సమీక్షించి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. అలాగే మంత్రి సీతక్క గారి సూచనల మేరకు ములుగు జిల్లా కేంద్రంలో త్వరలోనే ఎస్పీ కార్యాలయంతో పాటు నూతన కోర్టు భవనాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. యువత మరియు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తోందని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థులు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు చదువుపై దృష్టి పెట్టి, ఆ తర్వాత మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానం ఉన్నప్పుడే ప్రపంచంతో పోటీపడి రాణించగలరని, అందుకోసమే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు, ఏటీసీలను తీసుకొస్తున్నామని చెప్పారు. రైతులు, మహిళలు, యువత సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలబడాలని, అందరి సహకారంతో తెలంగాణను సుభిక్షంగా తీర్చిదిద్దుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ఏలూరులో ముగిసిన సిపిఐ పాదయాత్రలు

**ఏలూరు :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా పేద ప్రజలకు, కష్టజీవులకు, మధ్యతరగతి ప్రజానీకానికి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక, రైతాంగ వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, ఎన్నికల సందర్భంగా దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సెప్టెంబర్ ఒకటో తేదీన సిపిఐ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగు మహా ర్యాలీ, ధర్నాను జయప్రదం చేయవలసిందిగా ప్రజలకు సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. ఆగస్టు 6 నుండి ప్రారంభమైన సిపిఐ ప్రసార ఆందోళన పాదయాత్ర కార్యక్రమాలు శనివారం సాయంత్రం ఏలూరులో ముగిశాయి. శనివారం నాడు సిపిఐ నిర్వహిస్తున్న ప్రసార ఆందోళన కార్యక్రమం ఏలూరు నగరంలో వసంత మహల్ సెంటర్ హాయ్ హోటల్ దగ్గర, వైఎంహెచ్ఏ, బిర్లాభవన్ సెంటర్ తదితర కూడలిలలో జరిగిన సభలలో కృష్ణ చైతన్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమాలకు సిపిఐ ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ళ వరప్రసాద్ అధ్యక్షత వహించారు. కృష్ణ చైతన్య, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా హక్కుల పరిరక్షణ కోసం ఎర్రజెండా అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు . కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజాస్వామ్యాన్ని విచ్ఛిన్నం చేస్తూ , రాజ్యాంగాన్ని నష్టపరుస్తుందని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక,రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోకపోతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ ప్రచార ఆందోళన-పాదయాత్ర కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే , నాగం అచ్యుత్, సిపిఐ నాయకులు మావూరి విజయ, కొల్లూరు సుధారాణి, గొర్లి స్వాతి, కొండేటి రాంబాబు, ఉప్పులూరు లక్ష్మి, ఉప్పులూరి భవాని తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్‌లో పీఎం కిసాన్

**మొదటిపేజీ తరువాయి...** చేసుకోవాలి. లబ్ధిదారుల జాబితాలో మీ పేరు ఉందా లేదా అనేది అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే సరిచేసుకుంటే నిధులు సకాలంలో అందుతాయి.

గజరాజులు, చీకటి పడిన తర్వాత పంట పొలాలపై దాడి చేస్తూ అపార నష్టాన్ని కలిగిస్తున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ పరిణామాలపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, ప్రజల రక్షణే ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఈ మేరకు అటవీశాఖ ఉన్నతాధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన తక్షణ రక్షణ చర్యలపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఏనుగుల రాకపోకలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని పవన్ కల్యాణ్ సూచించారు. డ్రోన్ల సహాయంతో ఏనుగులు సంచరించే మార్గాలను పక్కాగా గుర్తించి, ఆ వివరాలను వెంటనే సమీప గ్రామాల ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు.

ప్రాణ, ఆస్తి నష్టాలను పూర్తిగా నివారించేందుకు అటవీ, రెవెన్యూ మరియు పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, రాత్రి వేళల్లో గస్తీ బృందాలను రంగంలోకి దించాలి. రైతులు మరియు ప్రజలు రాత్రి సమయాల్లో పొలాల వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. స్థానిక సమాచార వ్యవస్థలు, లౌడ్ స్పీకర్లు (మైకులు), మరియు మొబైల్ అలర్ట్ సందేశాల ద్వారా గ్రామస్తులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షించాలని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజల రక్షణ కోసం అవసరమైతే ప్రత్యేక శిక్షణ పొందిన 'హనుమాన్' ఎల దాడుల వల్ల పంటలు కోల్పోయిన రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. అధికారులు క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి నివేదికలు అందించిన వెంటనే, అటవీశాఖ నిబంధనల ప్రకారం బాధితులకు తక్షణ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### ప్రజలకు విజ్ఞప్తి మరియు అటవీశాఖ చర్యలు

ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉంటూ అధికారుల సూచనలను తూచా తప్పకుండా పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఏనుగులు కనిపిస్తే వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో అటవీశాఖ అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో చర్యలు ముమ్మరం చేశారు.

# ఇమామ్ మౌజన్ల గౌరవ వేతనాలకు నిధుల విడుదల

**రూ.22.50 కోట్లు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం**

**- ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్**

**అమరావతి** రాష్ట్రంలోని ఇమామ్‌లు, మౌజన్ల గౌరవ వేతనాల చెల్లింపునకు కూటమి ప్రభుత్వం రూ. 22.50 కోట్లను మంజూరు చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల కాలానికి గౌరవ వేతనాలు చెల్లించేందుకు ఈ నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంపై ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, వారి సంక్షేమం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి ఈ నిధుల మంజూరు నిదర్శనమని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఇమామ్‌లు, మౌజన్లకు క్రమం తప్పకుండా గౌరవ వేతనాలు అందేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. మంత్రులు నారా లోకేష్, ఎన్.ఎం.డి. ఫరూక్ సహకారంతో మైనారిటీల సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని అబ్దుల్ అజీజ్ తెలిపారు. రాష్ట్రంలోని ఇమామ్‌లకు నెలకు రూ. 10 వేలు, మౌజన్లకు రూ. 5 వేల చొప్పున గౌరవ వేతనం అందుతుందని, మూడు నెలలకు ఒక్కో ఇమామ్‌కు రూ. 30 వేలు, ఒక్కో మౌజన్‌కు రూ. 15 వేలు చొప్పున అందనున్నాయని పేర్కొన్నారు. మంజూరైన రూ. 22.50 కోట్లను ఏపీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవోకు విడుదల చేయాలని మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించిందని అబ్దుల్ అజీజ్ తెలిపారు. విడుదలైన నిధులను త్వరతిగతిన ఇమామ్, మౌజన్ లకు అందిస్తామని తెలిపారు.

## నేటి అర్ధరాత్రి నుంచి భోగాపురంలో

# విమానాల సర్వీసులు ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి...** నిర్మాణం మరియు ప్రత్యేకతలు భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 1న ఈ విమానాశ్రయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సుమారు రూ. 4,727 కోట్ల వ్యయంతో గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయంగా రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్ట్ కేవలం 31 నెలల్లోనే పూర్తైంది. షెడ్యూల్డ్ సమయం కంటే ఐదు నెలల ముందే నిర్మాణం పూర్తి కావడంతో పాటు, దేశంలో అత్యంత వేగంగా నిర్మించిన విమానాశ్రయాల్లో ఇది ఒకటిగా నిలిచింది. డీజీసీఏ ఏరోడ్రోమ్ లైసెన్స్‌తో పాటు భద్రత, అగ్నిమాపక, పర్యావరణ అనుమతులన్నీ ఈ ఎయిర్‌పోర్ట్‌కు ఇప్పటికే లభించాయి. విస్తరణ ప్రణాళికలు మరియు ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధి

మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించేలా దీన్ని డిజైన్ చేయగా, భవిష్యత్తులో ఈ సామర్థ్యాన్ని ఏటా 4 కోట్ల మందికి చేర్చేలా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. మొత్తం 2,703.26 ఎకరాల విశాలమైన విస్తీర్ణంలో (విమానాశ్రయానికి 2,203.32 ఎకరాలు, ఏవియేషన్ హబ్‌కు 500 ఎకరాలు, యూనివర్సిటీకి 136.63 ఎకరాలు) ఈ ప్రాజెక్ట్ విస్తరించి ఉంది. ఇక్కడి 3,800 మీటర్ల పొడవైన కోడ్-ఇ రన్‌వే బోయింగ్ 777, డ్రీమ్‌లైనర్, ఎయిర్‌బస్ వంటి భారీ అంతర్జాతీయ విమానాలను సైతం సులువుగా హ్యాండిల్ చేయగలదు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్రలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పర్యాటకం, పారిశ్రామిక పెట్టుబడులు, లాజిస్టిక్స్ మరియు ఏరోస్పేస్ రంగాల అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారనుంది.

# చరిత్ర తెలుసుకుంటేనే ...భవిష్యత్ నిర్మాణం

**టిఆర్ఎస్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో కవిత**

**హైదరాబాద్, :** చరిత్రను తెలుసుకున్న వాళ్లే భవిష్యత్తును చక్కగా నిర్మించగలరని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత అన్నారు. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో 80వ స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ... బ్రిటీష్ పాలనలో జరిగిన అఘాయిత్యాలు, విభజించి పాలించిన విధానం అందరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రెండు ప్రపంచ యుద్ధాలకు భారతీయులను సైనికులుగా వాడుకొని ఎంతో మంది చావులకు కారణమయ్యారని మండిపడ్డారు. బ్రిటీష్ వాళ్లు వచ్చిన తర్వాతే కుల వ్యవస్థ మరింత పెరిగిందని వ్యాఖ్యానించారు. అడవుల్లో ఉండే ఆదివాసీలను రాజ్యం పరిధిలోకి తెచ్చి తీరని అన్యాయం చేశారన్నారు. బ్రిటీష్ పరిపాలన పోయినప్పటికీ వాళ్ల ఆలోచనా విధానాన్నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని కవిత విమర్శించారు. ఇంగ్లీష్ మాట్లాడిన వాళ్లే గొప్ప అన్నట్లుగా చూస్తున్నారని.. తెలుగు భాష మాట్లాడితే తక్కువ చేసి చూస్తున్నారని మండిపడ్డారు. 'తెల్ల తోలు గొప్ప, నల్ల తోలు కాదన్నట్లుగా ప్రచారం చేసి మనలో మనల్ని శత్రువులను చేశారు' అని అన్నారు. ఆనాటి బ్రిటీష్ వాళ్ల పరిపాలన, ఆలోచనా విధానాన్ని వీడాలని కవిత పేర్కొన్నారు.

# 370 ఆర్టికల్ రద్దుచేయకుంటే పివోకె కలిసేది

**కాశ్మీర్ సిఎం ఓమర్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు**

**శ్రీనగం :** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ పరిస్థితులపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా, రాష్ట్ర హోదాను 2019లో రద్దు చేయకపోయి ఉంటే.. ఇప్పుడు పీవోకే ప్రజలు జమ్మూకశ్మీర్‌లో తిరిగి విలీనం కావాలని కోరుతూ ఉద్యమించేవారని ఆయన అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శ్రీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఒమర్ అబ్దుల్లా ఈ వ్యాఖ్యలు చేశారు. పీవోకేలో ప్రజాస్వామ్య హక్కుల కోసం ఆందోళన చేస్తున్న ప్రజలపై జరుగుతున్న పరిణామాలు తనను బాధిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అక్కడ పలువురు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గాయపడి జైలుకు వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. 1947లో పాకిస్థాన్ నుంచి వచ్చిన ఆక్రమణదారులను ఎదుర్కొన్న కశ్మీరీ ప్రజలను ఒమర్ అబ్దుల్లా గుర్తుచేసుకున్నారు. తన తాత, జమ్మూకశ్మీర్ తొలి ప్రధానమంత్రి షేక్ మహ్మద్ అబ్దుల్లా నేతృత్వంలోని కశ్మీరీలు ఆక్రమణదారులను ఎదుర్కొన్నారని చెప్పారు. భారత సైన్యం కశ్మీర్‌కు చేరుకోవడానికి ముందే స్థానిక ప్రజలు తమ ప్రాంతాన్ని రక్షించేందుకు పోరాడారని ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. 2019లో

జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా, ప్రత్యేక హోదాను రద్దు చేయకపోయి ఉంటే.. ఈ రోజు పీవోకే ప్రజలు జమ్మూకశ్మీర్‌లో తిరిగి విలీనం కావాలని కోరుతూ ఉద్యమించేవారని అన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో పీవోకేకు సంబంధించిన స్థానాలను ఖాళీగా ఉంచామని, ఏదో ఒక రోజు అవి భర్తీ అవుతాయని ఆశిస్తున్నామని తెలిపారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను, ఇతర రాజ్యాంగపరమైన హామీలను పునరుద్ధరించేందుకు తమ ప్రభుత్వం పోరాటం కొనసాగిస్తుందని ఒమర్ అబ్దుల్లా స్పష్టం చేశారు. జమ్మూకశ్మీర్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని చెప్పారు. కాగా, ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యలను జమ్మూకశ్మీర్ బీజేపీ నేత, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు సునీల్ శర్మ తప్పుపట్టారు. స్వాతంత్య్ర దినోత్సవం వంటి జాతీయ పర్వదినాన్ని రాజకీయ వ్యాఖ్యలకు ఉపయోగించడం బాధ్యతా రాహిత్యమని విమర్శించారు.

# భారత రాజకీయాల్లో సిద్ధాంతాల తేడాలు, తీవ్రమైన రాజకీయ వాదనలకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి

- కానీ కొన్నిసార్లు చరిత్ర ఒక చిన్న చిత్రాన్ని మిగిల్చి వెళ్తుంది.
- అది మొత్తం రాజకీయాల కంటే పెద్ద కథను చెబుతుంది.
- వార్త సేకరణ బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 16 (జన సంఘర్షణ)

ఇది 1972 నాటి సంఘటన. శిమ్లా ఒప్పందంలోని అంశాలపై ప్రతిపక్షంలో చాలా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. జనసంఘ్ ప్రముఖ నేత అటల్ బిహారీ వాజ్‌పేయి కూడా ఆ ఒప్పందాన్ని తీవ్రంగా విమర్శించారు. పార్లమెంటులో దానికి వ్యతిరేకంగా తన అభిప్రాయాన్ని బలంగా వ్యక్తం చేశారు.అదే సమయంలో ప్రధానమంత్రి ఇందిరా గాంధీ చర్చ కోసం వాజ్‌పేయిని పిలిచారు.గదిలో కూర్చుని మాట్లాడుకునే బదులు నడుస్తూ మాట్లాడుకుందాం అని ఇద్దరూ నిర్ణయించుకున్నారట. అప్పుడే ఉన్నట్టుండి చిరుజల్లు మొదలైంది. ఎవరో ఇందిరా గాంధీకి గొడుగు తెచ్చి ఇచ్చారు. ఇందిరా గారు గొడుగు విప్పారు. ఆ తర్వాత ఏం జరిగిందో ఇప్పటికీ ఈ బంధానికి ఒక అందమైన చిత్రంగా గుర్తుండిపోయింది. ఆమె తన తలపై వేసుకోకుండా గొడుగును అటల్ బిహారీ వాజ్‌పేయి తలపై పెట్టారు.వాజ్‌పేయి మాట్లాడుతూనే ఉన్నారు. ఇందిరా గాంధీ ఆయనకు గొడుగు పడుతూనే ఉన్నారు. ఒకవైపు దేశ ప్రధానమంత్రి. మరోవైపు ప్రతిపక్షంలోని పెద్ద నాయకుడు.ఆలోచనల్లో తీవ్రమైన తేడా.కానీ ఆ క్షణంలో వ్యక్తిగత హుందాతనం, పరస్పర గౌరవం కనిపించాయి. ఈ సంఘటనను తర్వాత సీనియర్ బీజేపీ నేత ఎస్. శేషాద్రి చారి ఒక ఎన్డీటీవీ కార్యక్రమంలో ప్రస్తావించారు. తాను అటల్ జీని ఈ ఫోటో గురించి అడిగినప్పుడు,అటల్ జీ ఈ సంఘటన నేపథ్యాన్ని వివరించారని ఆయన చెప్పారు. ఈ కథను మరింత ప్రత్యేకంగా చేసేది ఇదే రాజకీయాల్లో ప్రతిపక్షం ఉండవచ్చు,కానీ ప్రత్యర్థి పట్ల గౌరవం పోనవసరం లేదు. ఇందిరా గాంధీ,అటల్ బిహారీ వాజ్‌పేయి రాజకీయాలు



వేర్వేరు సిద్ధాంతాలకు చెందినవి. ఇద్దరూ ఒకరి విధానాలను ఒకరు వ్యతిరేకించుకున్నారు.కానీ ఇలాంటి సందర్భాలు ఆనాటి రాజకీయాల్లో వ్యక్తిగత సంభాషణకు, పార్లమెంటరీ మర్యాదకు కూడా చోటు ఉండేదని చూపిస్తాయి. అందుకే బహుశా ఈ గొడుగు ఈరోజు కేవలం వర్షం నుండి రక్షణగా కనిపించడం లేదు. రాజకీయ వైరుధ్యాల మధ్య కూడా మానవ సంబంధాల వెచ్చదనం కనిపించిన భారత రాజకీయాల్లోని ఒక కాలానికి ప్రతీకగా మారింది.

# వృద్ధాప్యంలో ఆరోగ్యకరమైన ఆహారం ప్రాముఖ్యత

హైదరాబాద్ సిటీ ప్రతినిధి నాగుల అంజిబాబు, ఆగస్టు 16, (జన సంఘర్షణ):

వయస్సు పెరిగే కొద్దీ శరీరంలోని పోషక అవసరాలు మారుతాయి. శారీరక మరియు జ్ఞాపకశక్తి సంబంధిత పనితీరును మెరుగుపరచడం, దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించడం, మొత్తం ఆరోగ్యం మరియు జీవన నాణ్యతను మెరుగుపరచడం కోసం వృద్ధులు ఆరోగ్యకరమైన, సమతుల్య ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యమైనది.

### 1. శారీరక సామర్థ్యం స్వతంత్ర జీవనానికి తోడ్పాటు

**కండరాల బలం మరియు శక్తి:** వయస్సు పెరిగే కొద్దీ సహజంగా కండరాల పరిమాణం తగ్గుతుంది (సార్కోపీనియా). తగినంత ప్రోటీన్ తీసుకోవడం వల్ల కండరాల బలం, శక్తి మరియు చలనశీలతను కాపాడుకోవచ్చు. ఇది సమతుల్యతను మెరుగుపరచి, పడిపోవడం మరియు ఎముకలు విరిగే ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**ఎముకల ఆరోగ్యం:** వృద్ధుల్లో ఎముకలు బలహీనపడే ఆస్టియోపోరోసిస్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. పాలు, పాల ఉత్పత్తులు, ఆకుకూరలు, కాల్షియం, విటమిన్ ఐ కలిగిన ఆహారాలను తీసుకోవడం ఎముకల ఆరోగ్యానికి సహాయపడుతుంది.

**జీర్ణక్రియ తగినంత నీరు:** తగినంత నీరు, పీచు పదార్థాలు తీసుకోవడం వల్ల జీర్ణక్రియ సక్రమంగా ఉండి, వృద్ధుల్లో సాధారణంగా కనిపించే మలబద్ధకాన్ని నివారించవచ్చు.

**రోగనిరోధక శక్తి:** పోషకాహారంతో కూడిన సమతుల్య ఆహారం రోగనిరోధక శక్తిని బలోపేతం చేసి, ఇన్ఫెక్షన్లు మరియు అనారోగ్యాలను ఎదుర్కోవడంలో సహాయపడుతుంది.

### 2. దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ

**గుండె ఆరోగ్యం:** సంతృప్త కొవ్వులు, ట్రాన్స్‌ఫ్యాట్లు తక్కువగా, పండ్లు, కూరగాయలు, పీచు పదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారం కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

**మధుమేహం:** సమతుల్య ఆహారం, నియంత్రిత కార్బోహైడ్రేట్ తీసుకోవడం రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది.

**అధిక బరువు:** సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యకరమైన బరువును కాపాడుకోవచ్చు. అధిక బరువుతో వచ్చే అనారోగ్యాల ప్రమాదాన్ని తగ్గించవచ్చు.


**ఇతర దీర్ఘకాలిక వ్యాధులు:** ఆరోగ్యకరమైన ఆహారం అధిక రక్తపోటు, ఆర్థ్రైటిస్, కొన్ని ఇతర దీర్ఘకాలిక వ్యాధుల నిర్వహణలో కూడా సహాయపడుతుంది.

### 3. జ్ఞాపకశక్తి మానసిక ఆరోగ్యం

**మెదడు ఆరోగ్యం:** ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు,



చదలవాడ సంతోషి కుమారి, సైకాలజిస్ట్, క్రైట్స్, అడ్వాన్స్ జెరియాట్రిక్ రిహాబిలిటేషన్,హైదరాబాద్.




యాంటీఆక్సిడెంట్లు, దీ విటమిన్లు వంటి పోషకాలు మెదడు ఆరోగ్యానికి ముఖ్యమైనవి. ఇవి జ్ఞాన సామర్థ్యాన్ని కాపాడుకోవడంలో, వయస్సుతో వచ్చే జ్ఞాపకశక్తి క్షీణత ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడవచ్చు.

**మానసిక శ్రేయస్సు:** ఆరోగ్యకరమైన ఆహారం మానసిక ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపి, ఆందోళన మరియు నిరాశ వంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

### 4. వృద్ధులకు అవసరమైన ముఖ్యమైన పోషకాలు

**ప్రోటీన్:** కండరాల బలం శరీర పనితీరును కాపాడుకోవడానికి వృద్ధులకు తగినంత ప్రోటీన్ అవసరం.

**విటమిన్ బీ12:** వయస్సు పెరిగే కొద్దీ శరీరం విటమిన్ దీ12ను గ్రహించే సామర్థ్యం తగ్గవచ్చు. అందువల్ల బీ12 ఉన్న ఆహారాలు లేదా వైద్యుల సూచన మేరకు ఫోర్టిఫైడ్ ఆహారాలు/సప్లిమెంట్లు తీసుకోవాల్సి రావచ్చు.

**విటమిన్ డి:** వయస్సు పెరిగే కొద్దీ చర్మం విటమిన్ డి తయారు చేసే సామర్థ్యం తగ్గుతుంది. అందువల్ల విటమిన్ ఐ ఉన్న ఆహారం, అవసరమైతే వైద్యుల సూచనతో సప్లిమెంట్లు తీసుకోవాలి.

**పీచు పదార్థాలు:** జీర్ణక్రియ సక్రమంగా ఉండటానికి, మలబద్ధకాన్ని నివారించడానికి తగినంత పీచు పదార్థాలు తీసుకోవడం చాలా ముఖ్యం.

**నీరు:** వృద్ధుల్లో డీహైడ్రేషన్ ప్రమాదం ఎక్కువగా ఉండవచ్చు. కాబట్టి రోజంతా తగినంత నీరు మరియు ఇతర ఆరోగ్యకరమైన ద్రవాలు తీసుకోవాలి.

### 5. వృద్ధాప్యంలో ఆరోగ్యకరమైన ఆహారం కోసం ఆచరణాత్మక సూచనలు


తాజా మరియు సహజమైన ఆహారాలకు ప్రాధాన్యత ఇవ్వండి. పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలు, పప్పులు, గుడ్లు, చేపలు మరియు ఇతర ఆరోగ్యకరమైన ప్రోటీన్ వనరులను తీసుకోండి. అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర కలిగిన పానీయాలు, అనారోగ్యకరమైన కొవ్వులను పరిమితం చేయండి. వివిధ రకాల ఆహారాలను తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన వివిధ పోషకాలను పొందండి. ముందుగానే భోజన ప్రణాళిక చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారాన్ని సులభంగా పాటించవచ్చు. వీలైనంత వరకు ఇంట్లో తయారుచేసిన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వండి. ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు, మీ శక్తి, ఆరోగ్యానికి అనుగుణంగా క్రమం తప్పకుండా శారీరక కార్యకలాపాలు చేయండి. వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులు, మధుమేహం, రక్తపోటు, మూత్రపిండాల సమస్యలు లేదా ఇతర వ్యాధులు ఉన్నట్లయితే వైద్యుడు లేదా నమోదిత డైటీషియన్ సలహా తీసుకోండి. ముఖ్యంగా: వృద్ధాప్యంలో ఆరోగ్యకరమైన ఆహారం కేవలం వ్యాధులను నివారించడానికి మాత్రమే కాదు – శక్తి, కండరాల బలం, మెదడు ఆరోగ్యం, స్వతంత్ర జీవనం, మెరుగైన జీవన నాణ్యతను కాపాడుకోవడానికి కూడా ఎంతో అవసరం.

# మెదక్ జిల్లా నిజాంపేట్ మండలం చలిమడ గ్రామ మాజీ సర్పంచ్ నర్సింంహారెడ్డి మృతి

- అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబాన్ని పరామర్శించిన మైనంపల్లి హనుమంతరావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 16 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా నిజాంపేట్ మండలం చలిమడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి గుండెపోటుతో మరణించిన విషయం తెలిసి రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు వారి గ్రామానికి వెళ్లారు. అక్కడ నర్సింహారెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నర్సింహారెడ్డి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మైనంపల్లి హనుమంతరావు తెలిపారు.



# సమాచారమే సంజీవి

హైదరాబాద్ సిటీ, మేడ్చల్ మల్కాజ్గిరి ప్రతినిధి నాగుల అంజిబాబు, ఆగస్టు 16, (జన సంఘర్షణ):

సమాజ మనుగడకు సంజీవిని సమాచారం
చంటి పిల్ల ఆకలైనా కన్నతల్లి కౌగిలైనా
అంభా రావమైనా అమ్మ పాటైనా
సమాచారం ముద్రలే...
సమాచార పరిణితే జ్ఞానం
వ్యాపకం, సంగ్రహణం
స్పందన, ప్రతి స్పందన
సంఘటిత సముచిత సమన్వయ వినియోగమే
సమాచార పరమావధి
సంజ్ఞలైనా సంకేతాలైన
శృతాలైనా పత్రాలైనా
పత్రికలుదాటిన నవీన
ప్రచార సాధనాలన్ని...
సమాచార విప్లవ ప్రతీకలే..



**–కొండూరి కోటి బాబు, హైకోర్టు అడ్వకేట్, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్.**

# డీసీసీ నిర్వహించిన నిరసన యాత్ర

- డి సి సి ప్రసిడెంట్ తోట దేవి ప్రసన్న
- చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ నాయుడు
- ఖర్గేకి సంఘీభావం వివక్షకు నిరసన

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం, ఆగస్టు 16 (జనసంఘర్షణ):

హల్ద్వానీలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మల్లికార్జున ఖర్గే పట్ల జరిగిన వివక్షపూరిత, అవమానకర చర్యను తీవ్రంగా ఖండిస్తూ, ఏఐసీసీ ఆదేశాల మేరకు భారీ నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ హేయమైన చర్యను నిరసిస్తూ, మన పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కి సంఘీభావం తెలియజేస్తూ, డీసీసీ ప్రెసిడెంట్ తోట దేవి ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన యాత్రలో చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే పై జరిగిన అవమానకర చర్యను తీవ్రంగా ఖండిస్తూ, కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి, రాజ్యాంగ విలువలకు, ప్రజాస్వామ్య స్ఫూర్తికి అండగా నిలిచారు.వివక్షకు వ్యతిరేకంగా... ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం...కాంగ్రెస్ పార్టీ ఐక్యంగా పోరాడుతుంది.



# కలెక్టరేట్‌లో రేపటి ప్రజావాణి రద్దు

- ప్రజావాణి హాల్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా కార్యక్రమం.
- ఆర్డీవో,తహసీల్దార్ కార్యాలయాల్లో యథావిధిగా ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ
- ప్రజలు గమనించి సహకరించాలి.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 16 (జన సంఘర్షణ)

మెదక్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం (ఆగస్టు 17) నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. అయితే ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో సోమవారం మధ్యాహ్నం 12:30 గంటలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో కలెక్టరేట్ స్థాయి ప్రజావాణిని రద్దు చేసినట్లు కలెక్టర్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ, కర్మాగారాలు,గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి జిల్లా అధికారులు,సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారని, అధికారులందరూ ఆయా విధుల్లో నిమగ్నమై ఉండనున్నందున సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిని తాత్కాలికంగా రద్దు చేయాల్సి వచ్చిందని కలెక్టర్ వివరించారు. అయితే ఆర్డీవో కార్యాలయాలు, మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి దరఖాస్తులను యథావిధిగా స్వీకరిస్తారని తెలిపారు.తమ సమస్యలు, విజ్ఞప్తులపై దరఖాస్తులు అందించాలనుకునే ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో మాత్రమే ప్రజావాణి రద్దయిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి, అధికార యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కోరారు.

# ప్రమాదవశాత్తు మరణించిన దురగొల్ల మల్లేశం మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 16 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో 6వ వార్డులో దొరగొల్ల మల్లేశం రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రమాదవశాత్తు మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్యబినాగరాజు మైనంపల్లి హనుమంతరావు గారికి సమాచారం ఇవ్వడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అన్ని విధాల సహకారం అందిస్తామని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చిట్కుల్ మహిపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్యబినాగరాజు,వైస్ చైర్ పర్సన్ పోచమ్మల నవనీతబి గణేష్,6 వార్డు కౌన్సిలర్ పుట్టి సందీప్,బ్లాక్ కాంగ్రెస్ నాయకులు రమేష్ రెడ్డి, డిసిసి జిల్లా ఉపాధ్యక్షుడు చింతల యాదగిరి,పట్టణ అధ్యక్షుడు చింతల స్వప్నబిస్వామి, మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, సి ఐ సైదా, ఎస్ ఐ బాలరాజు, రాజా కిషన్, తొంటవలి యాదగిరి,పట్టణ యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.



జన సంఘర్షణ
సోమవారం
17 ఆగస్టు 2026

# కొమరం భీం నిలయం దాతల సహకారం మరువలేనిది

- గిరిజన పేద విద్యార్థుల చదువులకు సహకరించడం సంతోషకరం
- వనవాసీ ప్రాంత మహిళా సహప్రముఖ్ ఆశాలత

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్ల మండలం , ఆగస్ట్ 16 (జనసంఘర్షణ) :

ఆదివాసీ గిరిజన విద్యార్థుల చదువులను ప్రోత్సహించేందుకు ముందుకు వస్తున్న దాతల సహకారం మరువలేనిదని వనవాసీ కళ్యాణ ప్రాంత మహిళా సహప్రముఖ్ పెద్దాడ ఆశాలత అన్నారు. మండల కేంద్రానికి చెందిన బుక్ స్టాల్ యజమాని స్వర్గీయ చిల్లంచర్ల విశ్వేశ్వరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి అనంతలక్ష్మి, కుమారులు కోటేశ్వరరావు, వెంకటసాయి, కుమార్తె కటకం విజయలక్ష్మి, చర్లలోని కొమరం భీం విద్యార్థి నిలయంకు రెండు క్వింటాల్ల బియ్యం, విద్యార్థులకు భోజనం, పండ్లను వితరణగా అందచేసారు. ఈ సందర్భంగా నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అద్యక్షతన జరిగిన సమావేశంలో ఆశాలత మాట్లాడారు. గిరిజన ఆదివాసీ విద్యార్థుల ఉన్నతికి దాతలు సహాయ సహకారాలను అందించడం సంతోషకరమని పేర్కొన్నారు. వనవాసీ కళ్యాణ పరిషత్ ఆదివాసీలకు విద్య, వైద్యం అందచేస్తూ వారి అభ్యున్నతికి పాటు పడుతోందని వెల్లడించారు. మారుమూల గ్రామాలు, కనీస మౌళిక సదుపాయాలు లేని గిరిజన గ్రామాలకు చెందిన ఇక్కడి విద్యార్థులు చదువులతో పాటు ఆటపాటలలో ముందుండటం హర్షనీయమని అన్నారు. శుభ, అశుభ కార్యక్రమాలు జన్మదినంల సందర్భంగా ఆడంబరాలకు పోయి డబ్బు వృదాగా ఖర్చు చేయకుండా ఆదివాసీ విద్యార్థుల విద్యకు అందించడం శుభపరినామమని పేర్కొన్నారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగ పరుచుకొని ముందుకు సాగాలని విజ్ఞప్తి చేసారు. క్రమశిక్షణకు మారుపేరయిన ఇక్కడి విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వనవాసీ జిల్లా కార్యదర్శి కోరం





సూర్యనారాయణ, సహ కార్యదర్శి గోగికార్ రాంలక్ష్మణ్, సాగర్, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, తోలెం రామకృష్ణ, పూజారి కాంకేర్ మాజీ సర్పంచ్ మజ్జ శోభారాణి, శబరి బాలికా నిలయ కార్యదర్శి బందా స్వరూపరాణి, నిలయ ప్రముఖ్ లు వరలక్ష్మి, సంతోష్ పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 16 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలో పలు బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆదివారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యేలు, పద్మాదేవేందర్‌రెడ్డి, పట్లోళ్ల శశిధర్‌రెడ్డితో కలిసి ఆయా కుటుంబ సభ్యులను ఓదార్చి,వారికి ధైర్యం చెప్పారు. గాంధారిపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కూచిన్ పల్లి విష్ణువర్ధన్‌రెడ్డి తల్లి సువర్ణ శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా శానాయిపల్లికి చెందిన కర్రి పెద్ద వెంకయ్య కుటుంబాన్ని, ఎల్లాపూర్ గ్రామానికి చెందిన గొల్ల గోపాల్ కుటుంబాన్ని పరామర్శించి ఇరు కుటుంబాలకు 5,000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని నాయకులు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాపన్నపేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు విశ్వవర్ధన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనాథ్‌రావు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్యరెడ్డి, నాయకులు మహిపాల్‌రావు, ప్రభుగౌడ్,





నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మిత్ర హిల్స్ ప్రజల నిరసన కార్యక్రమం

- ప్రభుత్వం వేలం పాట ఉపసంహరించాలి.
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు.

హైదరాబాద్ సిటీ, మేడ్చల్ మల్కాజ్గిరి ప్రతినిధి నాగుల అంజిబాబు, ఆగస్టు 16, (జన సంఘర్షణ):

మిత్ర హిల్స్ కాలనీ పక్కన ప్రభుత్వ భూమిని వేలం ద్వారా విక్రయించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మిత్ర హిల్స్ కాలనీ వాసులు నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కూకట్ పల్లి ఎమ్మెల్యే, శేరిలింగంపల్లి బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జి మాధవరం కృష్ణారావు ప్రత్యేక చొరవ తీసుకొని మిత్ర హిల్స్ కాలనీకి విచ్చేసారు. గతంలో 1999 లో హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ గ ఉన్న మాధవరం కృష్ణారావు, ఆ సమయంలో ఈ భూమిని హెచ్ఎండిఏకి ఇవ్వడం జరిగిందని గుర్తు చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితులలో ఈ ప్రభుత్వ భూమిని విక్రయించకుండ ప్రభుత్వం వేలంపాట నిర్ణయాన్ని ఉపసంహరించాలి అని కోరుతూ ప్రభుతానికి, హెచ్ఎండిఏ కమిషన్ కి, ఇతర అధికారులకి విన్నవించారు. కాలనీ వాసులకు అన్ని విషయాలలో అండగా ఉంటాను అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, మహిళలు, పెద్దలు పెద్దఎత్తున స్వచ్ఛంధంగా వచ్చి ఎమ్మెల్యే మాధవరం కృష్ణరావుతో కాలనీకి పార్క్ కావలి అని కోరుతూ ఈ ప్రభుత్వ భూమిని పార్క్ లాగా ప్రభుత్వం చేత చేయించండని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ లీడర్స్ అయిన హైదర్ నగర్ డివిజన్ ప్రెసిడెంట్ అరుణ్, ఓబీసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బి.సీతారామ రాజు, ఇతర బీజేపీ హైదర్ నగర్ డివిజన్ నాయకులు కూడ వచ్చి, ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మిత్ర హిల్స్ కాలనీ కి పార్క్ లాగ అభివృద్ధి చేయాలి అని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. బిఆర్ఎస్, బిజెపి రాజకీయ పార్టీలు కలిసి ముందుకు వచ్చి, ఈ ప్రభుత్వ భూమిని పార్క్ లాగ మన కాలనీకి ఇవ్వాలని ప్రభుతానికి డిమాండ్ చేయడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.





# మల్లన్న స్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతాలు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 16 (జన సంఘర్షణ)



మెదక్ మండలం మంబోజిపల్లి శివారులోని కొయ్యగుట్ట వద్ద వెలిసిన శ్రీ మల్లన్న స్వామి ఆలయంలో శ్రావణ మాసం తొలి వారం సందర్భంగా సత్యనారాయణ వ్రతాలు ఘనంగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ పూజారి మల్లన్న స్వామి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

# తొట్టెల కార్యక్రమానికి హాజరైన బిఆర్ఎస్ నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 16 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా హవేలిఘనపూర్ మండలం తొగిట గ్రామ మాజీ సర్పంచ్ మంద శ్రీహరి మనుమని తొట్టెల కార్యక్రమాన్ని ఏడుపాయలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మ దేవేందర్ రెడ్డి, శశి రెడ్డిలతో కలసి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి,చిన్నారి ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.వీరి వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్య రెడ్డి, హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ సాయిలు, నాయకులు రామచంద్ర రెడ్డి, యామి రెడ్డి, రాజేశ్వర్ రావు తదితరులు ఉన్నారు.

# స్వాతంత్ర్యం దినోత్సవం శుభాకాంక్షలు

రుద్రూర్: ఆగస్టు ( జన సంఘర్షణ)




80వ ఘన స్వతంత్ర దినోత్సవ అంబేద్కర్ కాలనీ రుద్రూర్ నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రం అంబేద్కర్ కాలనీ ఈ స్కూల్ వద్ద టీచర్స్ జెండా ఆవిష్కరణ చేశారు.

# 80వ స్వాతంత్ర్యం దినోత్సవ వేడుకలు






రుద్రూర్: ఆగస్టు ( జన సంఘర్షణ)

నిర్ణయించుకున్న రుద్రూర్ ప్రజలు నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రం అంబేద్కర్ వద్ద అధ్యక్షులు ఉపాధ్యక్షులు జెండా ఆవిష్కరణ చేశారు.

## భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని

వర్ని: ఆగస్టు ( జన సంఘర్షణ)



ఉమ్మడి జిల్లాలో నిజామాబాద్ బాన్సువాడ నియోజక వర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ శ్రీ కాసుల బాలరాజు, బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి. బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి. పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఉదయం పోచారం శ్రీనివాసరెడ్డి బాన్సువాడ పట్టణంలోని తన నివాసం వద్ద, ఆటోనగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో, తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.

## ఉత్తమ సేవలకు ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

మద్నూర్/, ఆగస్టు 16 /(జన సంఘర్షణ ప్రతినిధి):



స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ప్రజలకు నిబద్ధతతో సేవలందించిన ఉద్యోగులను జిల్లా అధికారులు ఘనంగా సత్కరించారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పలువురు ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మద్నూర్ మండలంలోని రెవెన్యూ, పోలీస్ శాఖల నుంచి ఇద్దరు ఉద్యోగులు ఉత్తమ సేవలకు ఎంపికయ్యారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రవి కుమార్, మద్నూర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా సేవలందిస్తున్న విట్టల్ ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికై ప్రశంసా పత్రాలు అందుకున్నారు. విధి నిర్వహణలో అంకితభావం, ప్రజాసేవలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా ఈ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు ఉద్యోగులను అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతంగా ప్రజలకు సేవలందించాలని సూచించారు. తమ సేవలను గుర్తించి ప్రశంసా పత్రాలు అందించడం మరింత బాధ్యతను పెంచిందని ఉద్యోగులు తెలిపారు.

## చలో ఢిల్లీని జయప్రదం చేయండి..



కోటగిరి, /ఆగస్టు 16/ (జన సంఘర్షణ ప్రతినిధి):



కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. కోటగిరిలో ఏ.విటల్ గౌడ్ అధ్యక్షతన... జరిగిన సీపీఐ మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.ఓమయ్య, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించారు. నిత్యావసర ధరల పెరుగుదల, కార్మిక చట్టాల మార్పులు, రైతులకు గిట్టుబాటు ధరల విషయంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకించాలని కోరారు. సెప్టెంబర్ 1న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ మండల నాయకులు నల్ల గంగాధర్, పోతంగల్ మండల కార్యదర్శి కొట్టే ప్రసాద్, నాయకులు శంకర్, సున్నం రాము, కప్ప సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ రేవంత్ రెడ్డి గూటికేనా..

◆ **పోచారం రాజకీయ అడుగులపై బాన్సువాడలో ఆసక్తికర చర్చ**

కామారెడ్డి ప్రతినిధి/, ఆగస్టు 16 /జన సంఘర్షణ



మాజీ మంత్రి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి రాజకీయ వైఖరిపై నియోజకవర్గంలో మరోసారి ఆసక్తికర చర్చ మొదలైంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేస్తూ కనిపిస్తున్న ఆయన.. మరోవైపు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకత్వంతో సన్నిహితంగా మెలుగుతున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై పోచారం శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే తాజాగా కాంగ్రెస్ నాయకత్వంతో ఆయన సన్నిహితంగా కనిపించడం, మరోసారి ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఊహాగానాలకు తెరలేపింది.

**విమర్శకుల ప్రశ్నలు....**

ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూనే అధికార పార్టీ నేతలతో సన్నిహితంగా ఉండటానికి కారణమేంటని ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిస్తున్నారు. పోచారం ఏ రాజకీయ గూటిలో ఉన్నారనే విషయంలో ఆయన వైఖరి స్పష్టంగా లేదని విమర్శిస్తున్నారు. అయితే ఇవన్నీ రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చలు, విమర్శలు మాత్రమేనని.. పోచారం శ్రీనివాస్ రెడ్డి నుంచి దీనిపై అధికారిక స్పష్టత రావాల్సి ఉందని పలువురు పేర్కొంటున్నారు.

**తదుపరి అడుగు ఎటు?....**

దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన పోచారం శ్రీనివాస్ రెడ్డి భవిష్యత్ రాజకీయ అడుగులు ఎలా ఉండబోతున్నాయన్నది ప్రస్తుతం బాన్సువాడ నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. ఆయన తీసుకునే ప్రతి నిర్ణయాన్ని రాజకీయ వర్గాలతో పాటు ప్రజలు కూడా నిశితంగా గమనిస్తున్నారని చర్చ సాగుతోంది. అయితే, పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం లేదా తన రాజకీయ భవిష్యత్తుపై ఏదైనా కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో "పోచారం తదుపరి రాజకీయ అడుగు ఎటు?" అన్న ప్రశ్నకు సమాధానం కోసం బాన్సువాడ రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





◆ **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

కామారెడ్డి బ్యూరో./ ఆగస్టు 16/జన సంఘర్షణ



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం కామారెడ్డి జిల్లా బిచ్కుందకు విచ్చేశారు. జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతారావు కుమార్తె వివాహ విందు కార్యక్రమానికి హాజరయ్యేందుకు బిచ్కుందకు చేరుకున్న ముఖ్యమంత్రిని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలోని వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రితో మర్యాదపూర్వకంగా చర్చించారు. జూకల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కుమార్తె విందుకు హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజచంద్ర నూతన వధూవరులకు ఆశీర్వదించారు. అంతకంటే ముందు బిచ్కుందకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాఖీ పౌర్ణమికి ముందే సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన ఇందుప్రియ

◆ **జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్..**




బిచ్కుంద/ఆగస్టు 16/జన సంఘర్షణ

హైదరాబాద్: కామారెడ్డి జిల్లా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కుమార్తె జోనిట వివాహ వేడుకలు హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. ఈ వివాహ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుసుకుని రాఖీ పౌర్ణమి సందర్భంగా ముందుగానే రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ కట్టి సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేయడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివాహ వేడుకకు తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ తదితర ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు నూతన దంపతులకు దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకలో రాజకీయ ప్రముఖుల సందడి, ఆత్మీయ కలయికలు ప్రత్యేకంగా నిలిచాయి.

# సీఎం చెక్.. కొండా ఫ్యామిలీ రాజకీయ ఆశలకు గండి!







**పరకాల, ఆగస్టు 16 (జన సంఘర్షణ):**
పరకాల రాజకీయాల్లో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఆసక్తికర చర్చకు దారితీశాయి. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తన కుమార్తె సుష్మితను బరిలోకి దించాలన్న మంత్రి కొండా సురేఖ ఆశలకు సీఎం వ్యాఖ్యలు చెక్ పెట్టినట్లుగా రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. పరకాలలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డే వచ్చే ఎన్నికల్లో మరోసారి పోటీ చేస్తారని, ఆయనను ప్రజలు ఆశీర్వదించాలని సీఎం కోరారు. దీంతో పరకాల టికెట్‌పై కొండా కుటుంబం పెట్టుకున్న ఆశలకు గండి పడినట్లేనని...రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇప్పటికే పరకాల నుంచి సుష్మిత పోటీ చేస్తారనే ప్రచారం స్థానికంగా జోరుగా సాగుతున్న నేపథ్యంలో సీఎం చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.మరోవైపు సీఎం ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనకు... మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి దంపతులు దూరంగా ఉండటం కూడా రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. సీఎం వ్యాఖ్యలు.. కొండా కుటుంబం గైర్హాజరు--ఈ రెండూ కలిపి చూస్తే పరకాల కాంగ్రెస్‌లో రాజకీయ సమీకరణాలు ఏ దిశగా మారబోతున్నాయన్న ఆసక్తి నెలకొంది.అయితే, రాబోయే రోజుల్లో కొండా కుటుంబం రాజకీయంగా ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది వేచి చూడాల్సిందే.

# బాల్య స్నేహానికి ప్రతీక.. మిత్రుడి కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సాయం

**పోతంగల్, ఆగస్టు 16 (జన సంఘర్షణ ప్రతినిధి):**
బాల్య స్నేహం అంటే కలిసి చదువుకోవడం, కలిసి మెలిసి ఉండటమే కాదు.. కష్టకాలంలో స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవడమని పోతంగల్ 2001--02 పదో తరగతి బ్యాచ్ మిత్రులు చాటిచెప్పారు. ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న స్నేహితుడి కుటుంబం ఆపదలో ఉందని తెలిసి మిత్రులంతా ఒక్కటై ఆర్థిక సహాయం అందించడం పలువురి ప్రశంసలు అందుకుంది. పోతంగల్ మండలం హంగర్గ ఫారం గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్ ఇటీవల దుర్కి ఎక్స్ రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఆయనకు నలుగురు పిల్లలు ఉండటంతో కుటుంబంపై ఆర్థిక భారం మరింత పెరిగింది. ఈ పరిస్థితిని తెలుసుకున్న ఇస్మాయిల్ బాల్య మిత్రులు వెంటనే స్పందించారు. పోతంగల్ 2001--02 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులంతా కలిసి రూ.40,000 నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కష్టకాలంలో కుటుంబానికి తాము అండగా ఉంటామని, అవసరాన్ని బట్టి భవిష్యత్తులోనూ తమ వంతు సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. చిన్ననాటి స్నేహాన్ని సంవత్సరాలు గడిచినా మరచిపోకుండా, మిత్రుడి కుటుంబానికి ఆపద సమయంలో అండగా నిలవడం ద్వారా బ్యాచ్ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. "సేవ మనది.. ప్రతిఫలం ఆ భగవంతునిదిలి" అనే స్ఫూర్తితో ఈ సహాయ కార్యక్రమాన్ని చేపట్టామని వారు తెలిపారు.




**స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత .....**

అందించడంతో పాటు, మానసిక ధైర్యం కల్పించిన ఈ కార్యక్రమం స్థానికంగా ఆదర్శంగా నిలిచింది. కష్టాల్లో ఉన్నవారికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైనంత సహాయం అందించాలని బ్యాచ్ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీతలే రమేష్, పబ్బ శేఖర్, బి. సాయిలు, కిరణ్, సుధాకర్ రెడ్డి, సలీం, రషీద్, సజ్జత్, మహేష్, లింగురం, సంతోష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు కూలినా పట్టించుకోరా?

- ఇందిరమ్మ ఇంటి కోసం ఒంటరి మహిళ ఎదురుచూపులు
- ప్రజాపాలనలో దరఖాస్తు చేసినా ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని ఆవేదన
- వర్షాలకు గోడలు... నాని.. షార్ట్ సర్క్యూట్‌తో మరింత ప్రమాదకరంగా మారిన ఇల్లు
- పారదర్శకంగా సర్వే చేసి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్







**రుద్రూర్ బాబు/ఆగస్టు 16/జన సంఘర్షణ ప్రతినిధి:**
పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన నిరుపేదలకు న్యాయం జరుగుతుందా? లేక స్థానిక స్థాయిలో నిర్లక్ష్యానికి గురవుతున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మాణిక్యమ్మ అనే ఒంటరి మహిళకు గత వర్షాకాలంలోనే ఇల్లు దెబ్బతిని నివాసానికి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. అప్పట్లో ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ఆ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో కూడా ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసినప్పటికీ, ఇప్పటివరకు తన ఇంటిపై సరైన విచారణ లేదా క్షేత్రస్థాయి పరిశీలన జరగలేదని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, ఈ వర్షాకాలంలో గోడలు పూర్తిగా నాని మరింత ప్రమాదకరంగా మారాయని, ఇటీవల షార్ట్ సర్క్యూట్ ఘటన కూడా చోటుచేసుకుందని మాణిక్యమ్మ వాపోతున్నారు. తాను ఒంటరి మహిళనని, తనకు సొంతంగా సురక్షితమైన ఇల్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఆమె పేర్కొంటున్నారు.

**గ్రామస్థాయి పరిశీలన ఏదీ?...**

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులను పారదర్శకంగా గుర్తించాల్సి ఉండగా, తన ఇంటి పరిస్థితిని పరిశీలించేందుకు గ్రామస్థాయి అధికారులు, సంబంధిత కమిటీ సభ్యులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మాణిక్యమ్మ ఆరోపిస్తున్నారు. గ్రామంలోని పెద్దలు, సర్పంచ్, రాజకీయ కార్యకర్తలు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా స్పందన కనిపించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అర్హత ఉంటే న్యాయం చేయాలి....**

ఇల్లు లేని, ఆర్థికంగా వెనుకబడిన అర్హులైన కుటుంబాలను స్థానికంగా పారదర్శకంగా సర్వే చేసి గుర్తించాలని, రాజకీయాలకు అతీతంగా అర్హత ఆధారంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. మాణిక్యమ్మ ఇంటి పరిస్థితిని అధికారులు స్వయంగా పరిశీలించి, ఆమె దరఖాస్తు వివరాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హత ఉంటే న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. "పేదల కోసం రూపొందించిన పథకం తమకు అందకపోతే ఇక ఎవరిని ఆశ్రయించాలి?" అంటూ మాణిక్యమ్మ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో సమగ్రంగా సర్వే నిర్వహించకపోతే, అర్హులైన పేదల విషయంలో నిర్లక్ష్యం కొనసాగుతోందనే విమర్శలు మరింత పెరిగే అవకాశం ఉంది.



# కోటగిరి కానిస్టేబుల్ సాయన్నకు ఉత్తమ అవార్డు

- సేవలకు గుర్తింపుగా నిజామాబాద్ సీపీ సాయి చైతన్య చేతుల మీదుగా పురస్కారం

**కోటగిరి, ఆగస్టు 16 (జన సంఘర్షణ):**



కోటగిరి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సాయన్నకు ఉత్తమ సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య చేతుల మీదుగా కానిస్టేబుల్ సాయన్న ఉత్తమ అవార్డును అందుకున్నారు. విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా సేవలందిస్తున్న సాయన్నను ఉన్నతాధికారులు అభినందించారు. తన సేవలకు గుర్తింపుగా అవార్డు అందుకోవడం పట్ల కోటగిరి పోలీస్ స్టేషన్ సిబ్బంది, సహచరులు, స్థానికులు సాయన్నకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో పాటు పలువురు పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రజా సేవలో అంకితభావంతో విధులు నిర్వర్తిస్తే గుర్తింపు తప్పక లభిస్తుందనే విషయాన్ని కానిస్టేబుల్ సాయన్న అందుకున్న ఈ ఉత్తమ అవార్డు మరోసారి చాటిచెప్పింది.

# గీతా మూర్తి మేడంకు ప్రధాని మోదీ ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు

- తనను గుర్తు చేసుకుని శుభాకాంక్షలు తెలిపిన మోదీకి కృతజ్ఞతలు తెలిపిన గీతా మూర్తి

**పోతంగల్/ఆగస్టు 16 (జన సంఘర్షణ):**




గీతా మూర్తి మేడం జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమెకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీ నుంచి జన్మదిన శుభాకాంక్షలు అందుకోవడం పట్ల గీతా మూర్తి మేడం ఆనందం వ్యక్తం చేశారు. తనను గుర్తు చేసుకుని శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా అభిమానులు, శ్రేయోభిలాషులు సైతం గీతా మూర్తి మేడంకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమె మరెన్నో విజయాలు సాధిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బాన్సువాడ నియోజకవర్గ నాయకులు గంగాధర్ గౌడ్ లాయర్, బీజేపీ డైనమిక్ లీడర్, పోతంగల్ మండల యువ నాయకుడు పబ్బా శేఖర్ కుటుంబ సభ్యులతో తదితరులు పాల్గొన్నారు.

# చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన వ్యక్తి ఆకస్మిక మృతి

**టాక్లి, ఆగస్టు 16 (జన సంఘర్షణ ప్రతినిధి):**




టాక్లి మండలానికి చెందిన జీవన్ పటేల్ (48) అనే వ్యక్తి శనివారం మధ్యాహ్నం ఇంట్లో అకస్మాత్తుగా కళ్లు తిరిగి కిందపడటంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన బోధన్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, నెల రోజుల క్రితం ప్రత్యర్థులు జరిపిన దాడిలో జీవన్ పటేల్ గాయపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దాడిలో గాయపడిన ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం కోలుకుని ఇంటికి వచ్చారు. ఈ క్రమంలోనే శనివారం అకస్మాత్తుగా అస్వస్థతకు గురై మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కోలుకుని ఇంటికి వచ్చిన వ్యక్తి ఇలా ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. జీవన్ పటేల్ మృతికి ఖచ్చితమైన కారణం తెలుసుకునేందుకు పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం. నిర్వహించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఆహ్వాన పత్రిక ఇచ్చి అరెస్టు చేయడం సిగ్గుచేటు: బీజేపీ

**బిచ్కుంద, ఆగస్టు 16 (జన సంఘర్షణ):**
జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు తన కుమార్తె వివాహ మహోత్సవానికి పార్టీలకతీతంగా ఆహ్వాన పత్రికలు అందించి, అదే కార్యక్రమం సందర్భంగా బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయించడం సిగ్గుచేటని బీజేపీ బిచ్కుంద మండల అధ్యక్షుడు శెట్టిపల్లి విష్ణు తీవ్రంగా విమర్శించారు. ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కుమార్తె వివాహ వేడుకకు హాజరుకానున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా బీజేపీ నాయకులను అరెస్టు చేశారు. ఈ ఘటనను బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా శెట్టిపల్లి విష్ణు మాట్లాడుతూ.. "పార్టీలకు అతీతంగా మా కుమార్తె వివాహానికి రావాలని ఆహ్వాన పత్రికలు ఇచ్చి, మరోవైపు అదే కార్యక్రమం పేరుతో బీజేపీ నాయకులను అరెస్టు చేయించడం ఎంతవరకు సమంజసం?" అని ప్రశ్నించారు. శుభకార్యానికి హాజరయ్యే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అడ్డుకునేంత దిగజారిన రాజకీయాలు బీజేపీ చేయదని ఆయన స్పష్టం చేశారు. అలాంటప్పుడు బీజేపీ నాయకులకు వివాహ ఆహ్వాన పత్రికలు ఎందుకు



ఇచ్చారని ప్రశ్నిస్తూ ఎమ్మెల్యే తీరుపై ఆయన మండిపడ్డారు.ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం సరైన విధానం కాదని, ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ నాయకులు తెలిపారు. ఈ ముందస్తు అరెస్టుల్లో గంగరాజు, కమ్మరి గంగాధర్, ధనూర్ విట్టల్, రాజు తదితరులు ఉన్నారు.

# పైప్‌లైన్ పనుల్లో రూ.98 కోట్ల బంగారు నిధి వెలుగులోకి!

**బెల్జియం/, ఆగస్టు 16/ (జన సంఘర్షణ):**
పైప్‌లైన్ పనులు చేస్తుండగా ఓ యువకుడికి కోట్లాది రూపాయల విలువైన బంగారు నిధి బయటపడిన ఘటన బెల్జియంలో ఆసక్తికరంగా మారింది. సెయింట్ గిల్లిస్ డెండర్మొండే ప్రాంతంలో పైప్‌లైన్ పనులు జరుగుతుండగా 18 ఏళ్ల కోబెకు ఈ భారీ నిధి కనిపించింది. మొదట నేలలో కనిపించిన వాటిని సాధారణ యూరో నాణేలుగా భావించినట్లు కోబె తెలిపాడు. అయితే కొద్దిసేపటికే అక్కడ బంగారు బిస్కెట్లు కూడా కనిపించడంతో విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. "అధికారులు రంగంలోకి దిగి తవ్వకాలు చేపట్టగా మొత్తం 9 మిలియన్ యూరోలు (సుమారు రూ.98 కోట్లు) విలువైన బంగారు బిస్కెట్లు, నాణేలు బయటపడినట్లు సమాచారం. వెలికితీసిన నిధిని అధికారులు బ్రస్సెల్స్‌కు తరలించి భద్రపరిచారు. ఈ భారీ నిధి అసలు ఎవరిది?... ఇంతకాలం అది అక్కడికి ఎలా చేరింది? అనే అంశాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. చట్టబద్ధమైన యజమానులను గుర్తించే ప్రయత్నాలు





కొనసాగుతున్నాయి. పైప్‌లైన్ పనుల్లో అనుకోకుండా కోట్ల... విలువైన నిధి బయటపడటం ప్రస్తుతం స్థానికంగా తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# పార్థివ వాహన సేవలు ఆగిపోనున్నాయా?

- **పేదల కోసం అందుబాటులోకి వచ్చిన సేవలకు నిధుల కొరత.. 108, 102 సేవలపైనా ప్రభావం?**
- **ప్రభుత్వం వెంటనే స్పందించాలని ప్రజల విజ్ఞప్తి**

**హైదరాబాద్/ఆగస్టు 16/ జన సంఘర్షణ )**
తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందిన పేద, మధ్యతరగతి కుటుంబాలకు పార్థివ దేహాన్ని స్వగ్రామానికి తరలించడం గతంలో ఎంతో భారంగా ఉండేది. ప్రైవేట్ అంబులెన్సులు అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తున్న నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం 2016 నవంబర్‌లో పార్థివ వాహనాల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తున్నాయి. అయితే ప్రస్తుతం పార్థివ వాహనాల సేవలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడినట్లు సమాచారం. గత రెండేళ్లుగా పార్థివ వాహనాల నిర్వహణ సంస్థకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో సిబ్బంది వేతనాలు, డీజిల్, వాహనాల నిర్వహణ ఖర్చులను భరించడం కష్టంగా మారినట్లు తెలుస్తోంది. దీంతో సేవలను నిరంతరాయంగా కొనసాగించడం నిర్వహణ సంస్థకు భారంగా మారిందని సమాచారం. వాహనాల్లో పనిచేస్తున్న సిబ్బందికి కూడా సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. ఈ సమస్యను నిర్వహణ సంస్థ అధికారులు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నిధుల విడుదలలో జాప్యం కొనసాగుతున్నట్లు సమాచారం.

**108, 102 సేవలపైనా ప్రభావం?....**

పార్థివ వాహనాల సేవలతో పాటు అత్యవసర వైద్య సేవలు అందించే 108, 102 వాహనాల నిర్వహణకు సంబంధించిన నిధుల విడుదలలోనూ జాప్యం జరుగుతున్నట్లు ఉద్యోగులు, అధికారులు పేర్కొంటున్నట్లు సమాచారం. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ఈ సేవల నిర్వహణ కూడా ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పేదల ప్రాణాలకు, కుటుంబాల కష్టాలకు సంబంధించిన ఈ అత్యవసర సేవలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. పార్థివ




వాహనాలతో పాటు 108, 102 సేవలకు అవసరమైన నిధులను సకాలంలో విడుదల చేసి సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్న ఈ సేవలు నిలిచిపోకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# నిరుపేదపేద విద్యార్థినికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ఆర్థిక సహాయం

**చిత్తూరు ఆగస్టు 16 (జన సంఘర్షణ**
చిత్తూరు పార్లమెంటు సభ్యులు రాష్ట్ర టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు చిత్తూరు నగర పరిధిలోని 25వ డివిజన్ కుక్కల పల్లిలో నివాసముండే వడ్డెర సామాజిక వర్గానికి చెందిన గోవిందరాజుల కుమార్తె చిత్తూరు సమీపంలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ రెండవ సంవత్సరం విద్యనభ్యసిస్తోంది. వీరిది నిరుపేద కుటుంబం. బతుకు బండి బారంగా మారిన గోవిందరాజులుకు తన కుమార్తెను చదివించడం కష్టతరంగా మారింది. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు విషయాన్ని, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావుకు చేరవేసారు. స్పందించిన ఎంపి నిరుపేద విద్యార్థినికి 10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకున్నారు. తమకు బాసటగా నిలిచిన చిత్తూరుఎంపీకిగోవిందరాజుల కుటుంబంకృతజ్ఞతలు తెలియజేసింది.



## సీఐ వెంకటనారాయణ పనితీరు భేష్.. ప్రశంసల వెల్లువ

**బోధన్,/ ఆగస్టు 16/ (జన సంఘర్షణ):**



ప్రజలకు చేరువగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణ, నిఘా వ్యవస్థను సమర్థంగా పర్యవేక్షిస్తూ విధుల్లో ప్రతిభ కనబరుస్తున్న బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణపై పట్టణ ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. పట్టణంలో ఎలాంటి సమస్య.... తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతూ ప్రజలకు భరోసా కల్పిస్తున్న సీఐ పనితీరు అభినందనీయమని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచినందుకు క్యాబినెట్ హోదా ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య చేతుల మీదుగా సీఐ వెంకటనారాయణ ప్రతిభా పురస్కారం అందుకున్నారు.ఈ సందర్భంగా సీఐ.... వెంకటనారాయణను పట్టణ ప్రజలు అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## బాడాపహాడ్ కమాన్ నిర్మాణానికి భూమి పూజ చేసిన మాజీ డీసీసీబీ చైర్మన్ శ్రీ పోచారం భాస్కర్ రెడ్డి

**వర్ని/ ఆగస్టు16/జన సంఘర్షణ**







వర్ని మండల కేంద్రంలోని బాడాపహాడ్ చౌరస్తా వద్ద నూతనంగా నిర్మించనున్న బాడాపహాడ్ కమాన్ (స్వాగత తోరణం) నిర్మాణ పనులకు స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేసిన మాజీ డీసీసీబీ చైర్మన్ శ్రీ పోచారం భాస్కర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో వర్ని మండలానికి చెందిన, ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబా, భారీ భాయ్, కరీం, బుజ్జి ప్రజాప్రతినిధులు, నాయకులు, ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున, తదితరులు, పాల్గొన్నారు,

## పుంజాల శివశంకర్ 97వ జయంతి సందర్భంగా ఘనంగా మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన కార్యక్రమం

**కోకాపేట, /ఆగస్టు 16/ (జన సంఘర్షణ):**






స్వర్గీయ పుంజాల శివశంకర్ 97వ జయంతిని పురస్కరించుకుని కోకాపేటలోని మున్నూరు కాపు సంఘ భవనంలో మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన రాష్ట్ర కన్వీనర్ ఉగ్గే శ్రీనివాస్ పటేల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వర్గీయ పుంజాల శివశంకర్ సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని నాయకులు గుర్తుచేశారు. మున్నూరు కాపుల ఆత్మగౌరవం, హక్కులు, అభివృద్ధి కోసం ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టేట్ కో-కన్వీనర్లు కంశం శెట్టి కృష్ణ, పత్తి అనిల్, డోంగ్లి శ్రీనివాస్, పుప్పాల ప్రభాకర్, ఆకుల మల్లేష్, వెంపటి సోమన్న, సరాఫ్ శ్రీకాంత్, ఆత్మకూరు సురేష్, మున్నూరు అంజి, ఆకుల శశికాంత్, మున్నూరు సురేందర్, ఆంజనేయులు రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.అలాగే పలువురు జిల్లా స్థాయి నాయకులు, మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
సోమవారం
17 ఆగస్టు 2026

## కల్యాణ లక్ష్మీ-షాదీ ముబారక్‌పై బీఆర్ఎస్ సమరశంఖం

- 17న నియోజకవర్గ, మండల కేంద్రాల్లో భారీ ధర్నాలకు పిలుపు



బీఆర్ఎస్ పెద్దలు డాక్టర్ ఎంఎ అకీమ్

**పోతంగల్, ఆగస్టు 16 (జన సంఘర్షణ):** పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే కల్యాణ లక్ష్మీ--షాదీ ముబారక్ పథకాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆందోళనకు సిద్ధమైంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు సోమవారం (ఆగస్టు 17) నియోజకవర్గ కేంద్రాలతో పాటు అన్ని మండల కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పోతంగల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సుద్దాం నవీన్ తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు అందించడంలో జాప్యం చేయడం సరికాదని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి బకాయిలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు.

**పెద్ద సంఖ్యలో పాల్గొనాలి**

ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సుద్దాం నవీన్ పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై ప్రజల తరపున ఒత్తిడి తీసుకువచ్చేలా ఆందోళనను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, సామాజిక సేవకులు డాక్టర్ ఎం.ఏ. హకీమ్ మాట్లాడుతూ.. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు అండగా నిలిచే పథకాలను ప్రభుత్వం నిర్వీర్యం చేయకుండా వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరారు. కల్యాణ లక్ష్మీ-షాదీ ముబారక్ పథకాలపై బీఆర్ఎస్ చేపట్టనున్న ధర్నాలు... నియోజకవర్గ, మండల కేంద్రాల్లో రాజకీయంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి.

## రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

- ఏడవ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

**వీకోట ఆగస్టు 16 (జన సంఘర్షణ):**



రాష్ట్రంలోని రజకులను ఎస్సీ జాబితా లో చేర్చాలని రాష్ట్ర రజక ఎస్సీ సాధన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన వీకోట లో ఆదివారం ఏపీ రజక ఎస్సీ సాధన కమిటీ కార్యదర్శి సోమశేఖర్ అధ్యక్షతన ఏడవ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీ స్టేట్ రజక ఎస్సీ సాధన కమిటీ కన్వీనర్ అక్కినపల్లి లక్ష్మయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. రజకుల చిరకాల వాంఛ తమను ఎస్సీల్లో చేర్చాలన్న డిమాండ్ కు కట్టుబడి జాతి ఐక్యతకు కట్టుబడి సాధించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిత్తూరు జిల్లా మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ షణ్ముఖం మాట్లాడుతూ... రజకులను దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లో ఎస్సీగా, 2 రాష్ట్రాల్లో ఎస్టీలుగా గుర్తించారన్నారు. ఆంధ్రప్రదేశ్ లో మాత్రం ఇప్పటికీ బీసీ-ఏ కేటగిరీలోనే ఉందన్నారు. 2014 టీడీపీ మేనిఫెస్టోలో రజక కులాన్ని ఎస్సీ గా గుర్తించడానికి కమిటీ వేస్తామని, ప్రభుత్వం దిగిపోయే సమయంలో అధ్యయన కమిటీ ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రభుత్వం మారడంతో తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం 5 సంవత్సరాలలో ఈ అంశాన్ని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే చర్యలు తీసుకొని రజకులకు ఇచ్చిన హామీని నెరవేర్చే విధంగా నిర్ణయం తీసుకొని, రజక కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీ తీర్మానించి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేసారు. రజక కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని, రజక కార్పొరేషన్ కు తగినంత బడ్జెట్, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించి, వృత్తిదారులకు ఆర్థిక సహాయం, గృహ వసతి కల్పించాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వస్తేనే మా పిల్లలకు విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు లభిస్తాయన్నారు. తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు సీనియర్ నాయకులు రామచంద్ర నాయుడు మాట్లాడుతూ ఏడవ రౌండ్ టేబుల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు . విద్యావంతులు, మేధావులు, కుల సంఘ ప్రతినిధులు రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మాన కాపీని వారికి అందించారు. ఈ కార్యక్రమంలో లా కాలేజ్ ప్రొఫెసర్ నారాయణ, మల్లల నాగరాజ్, మోహన్, చిన్నస్వామి తోపాటు వీకోట గంగాభవాని రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో శ్రీ మారెమ్మ తల్లికి మొక్కుబడులు చెల్లించుకొన్న గ్రామస్థులు

**బైరెడ్డిపలి ఆగస్టు16 (జన సంఘర్షణ):** బైరెడ్డిపల్లి గ్రామ పంచాయితీకి చెందిన మర్రిమానుచేను గ్రామంలో ఆదివారం గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం,విశేష పూజలు నిర్వహించారు.పూజలు చేపట్టినారు. ఈనేపథ్యంలో మహిళలు ఊరేగింపుగా దీపాలు ను ఎత్తుకొని ఆలయం చేరుకొన్నారు.అనంతరం గ్రామస్థులు అమ్మవారికి పూజలు చేశారు.గ్రామంకు చెందిన యువకులు అమ్మవారికి గజమాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## సర్పంచ్, సెక్రటరీల మధ్య వివాదం.. ఇరువర్గాలపై కేసులు

- ఎంపీడీఓ కార్యాలయంలో వాగ్వాదం.. పరస్పరం దాడుల ఆరోపణలు
- ఇరువర్గాల ఫిర్యాదులతో కేసులు నమోదు..
- ఘటనపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. అధికారుల హెచ్చరిక



**పెద్దేముల్, ఆగస్టు 16 (జన సంఘర్షణ):** పెద్దేముల్ మండల పరిధిలోని కందెనెల్లి తండా సర్పంచ్ రాథోడ్ ఆనంద్ నాయక్, ఆయన కుమారుడు నితీష్ కుమార్, పంచాయతీ సెక్రటరీలు మల్లేశం, కే. నవితల మధ్య తలెత్తిన వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. ఎంపీడీఓ కార్యాలయంలో విధి నిర్వహణ సమయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, అనంతరం పరస్పరం దాడులకు పాల్పడినట్లు ఫిర్యాదులు నమోదయ్యాయి.

**ఎంపీడీఓ కార్యాలయంలో వాగ్వాదం.....**

విధి నిర్వహణలో ఉన్న సమయంలో సర్పంచ్ ఆనంద్ నాయక్, పంచాయతీ సెక్రటరీలు మల్లేశం, కే. నవితల మధ్య వివాదం తలెత్తినట్లు పోలీసులు తెలిపారు. మాటామాటా పెరగడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నట్లు సమాచారం. దీంతో కొంతసేపు ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

**ఇరువర్గాల ఫిర్యాదులు....**

ఘటన అనంతరం ఇరువర్గాలు పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ఫిర్యాదులను పరిశీలించిన పోలీసులు ఇరువర్గాలపై వేర్వేరుగా కేసులు నమోదు చేశారు.

**సర్పంచ్, ఆయన కుమారుడిపై కేసు**

పంచాయతీ సెక్రటరీ మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్పంచ్ రాథోడ్ ఆనంద్ నాయక్, ఆయన కుమారుడు నితీష్ కుమార్‌లపై క్రైమ్ నెంబర్ 152/2026లో 121(1), 132, 351(2) రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పెద్దేముల్ ఎస్ఐ ఎం. ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.

**ఇద్దరు సెక్రటరీలపై కేసు...**

అదేవిధంగా సర్పంచ్ ఆనంద్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచాయతీ సెక్రటరీలు మల్లేశం, కే. నవితలపై క్రైమ్ నెంబర్ 153/2026లో 118(1), 351(2), 352 రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

**దర్యాప్తు కొనసాగుతోంది**

ఇరువర్గాల ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేసిన పోలీసులు ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. ఘర్షణకు అసలు కారణం ఏమిటి? ఘటనలో ఎవరి పాత్ర ఎంతమేర ఉంది? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. అధికారుల విధులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించడం, కార్యాలయాల్లో వాగ్వాదాలు, దాడులకు పాల్పడటం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని పోలీసులు హెచ్చరించినట్లు సమాచారం. వివాదాలను చట్టపరమైన మార్గంలో పరిష్కరించుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## సర్దార్ గౌతు లచ్చన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

- డీఆర్వో కె. మోహన్ కుమార్



**చిత్తూరు, ఆగస్టు 16(జన సంఘర్షణ):** స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు ఉద్యమకారుడు,అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్తెలిపాడు.ఆదివారం కలెక్టర్కార్యాలయంలోజిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న 117 వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్వో మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేసిన నిబద్ధతకలిగిననాయకుడని కొనియాడారు. స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచే ప్రజా సమస్యలపై పోరాటం ప్రారంభించిన లచ్చన్న అనేక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో జరిగిన ఉప్పు సత్యాగ్రహంతో పాటు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు జీవితం అనుభవించారని గుర్తుచేశారు. జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా, మద్యపాన నిషేధం కోసం, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, పేదలు, బీసీ, బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన నిరంతరం పోరాడారని తెలిపాడు. బీసీ వర్గాల అభ్యున్నతికి లచ్చన్న చేసిన కృషి చిరస్మరణీయమని, సమాజంలోని అణగారిన వర్గాలకు ప్రత్యేక గుర్తింపు, అవకాశాలు కల్పించేందుకు ఆయన చేసిన పోరాటం నేటికీ ఆదర్శప్రాయమని తెలిపారు. అధికారంలో ఉన్న సమయంలోనే కాకుండా ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడిన నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. లచ్చన్న జీవితాన్ని పరిశీలిస్తే దాదాపు జీవితాంతం ప్రజా పోరాటమే కనిపిస్తుందని, ఆయన చూపిన మార్గం ప్రస్తుత రాజకీయ నాయకులు, యువతకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎంతకాలం జీవించామన్నది కాకుండా సమాజంపై ఎంతటి సానుకూల ప్రభావం చూపించామన్నదే ముఖ్యమని, ఆ కోణంలో లచ్చన్న జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ .సి కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్,బీసీ సంక్షేమ శాఖఅధికారి రబ్బానీ భాష, జిల్లా మత్స్య శాఖాధికారి జి జే ప్రమోద మల్లె నాగరాజు గౌడ్ ,కృష్ణమూర్తి గౌడ్ ,గోపి గౌడ్. ఈశ్వరయ్య ఎక్సైజ్ సి.ఐ (రిటైర్డ్),పి రవి ఎం బీసీ బిజెపి నాయకులు అట్లూరి శ్రీనివాసులు నిరదక్షలు గౌడ్ ప్రభావతమ్మ , ప్రసాద్ జనార్ధన్ గౌడ్ ఈడిగ కులస్తులు ప్రజాప్రతినిధులు మరియు బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## తిరుపతి జిల్లా యువ వాలీబాల్ క్రీడాకారిణిలతో శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ముఖాముఖి



**తిరుపతి/ఆగస్టు 16 (జన సంఘర్షణ):** ఈ రోజు తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తిరుపతి జిల్లాకు చెందిన యువ వాలీబాల్ క్రీడాకారిణిలతో శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు గారు ప్రత్యేకంగా ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఆయన, వారి క్రీడా ప్రస్థానం, శిక్షణలో ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ లక్ష్యాలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అవసరమైన అంశాలపై వివరంగా తెలుసుకున్నారు. అలాగే వారి ఆర్థిక పరిస్థితులు, విద్యార్హతలు, కుటుంబ నేపథ్యం, తల్లిదండ్రుల వివరాలను అడిగి తెలుసుకుని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం మరియు శాప్ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. క్రీడాకారిణిలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు పౌష్టికాహారం, సింథటిక్ వాలీబాల్ కోర్ట్, ఆధునిక క్రీడా సామగ్రి, మెరుగైన శిక్షణ సదుపాయాలు కల్పించాలని రవి నాయుడుని కోరారు. దీనిపై స్పందించిన ఆయన, మహిళా వాలీబాల్ క్రీడాకారిణిల ప్రతిభను మరింత ప్రోత్సహించేలా తిరుపతిలో ప్రత్యేక వాలీబాల్ అకాడమీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ అకాడమీ ద్వారా నాణ్యమైన కోచింగ్, ఆధునిక క్రీడా సామగ్రి, మెరుగైన శిక్షణ సదుపాయాలు, పౌష్టికాహారం వంటి అవసరమైన సౌకర్యాలను అందించేలా ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. మహిళా వాలీబాల్ క్రీడాకారిణిలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకువచ్చేలా శాప్ ఎల్లప్పుడూ వారికి అండగా నిలుస్తుందని రవి నాయుడు స్పష్టం చేశారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co